క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి..



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవల్లికప్రియ

పూసపాటిరేగ: ఎన్నికల విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రవల్లిక ప్రియ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల పరిధిలో గల 72 పోలింగ్ బూత్‌లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలైన చింతపల్లి, రెల్లివలస, కుమిలి, ఎరుకొండ, కందివలస, తిప్పలవలస గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు మీనా పట్నాయక్, కె. విద్యాసాగర్, బి. పాపినాయుడు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



సీఐగా వెళ్తున్న బాలకృష్ణను సన్మానిస్తున్న పోలీస్ సిబ్బంది

పూసపాటిరేగ: విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని భోగాపురం రూరల్ సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న గేదెల బాలకృష్ణను సహచర ఉద్యోగులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్తశుద్ధితో పనిచేసినప్పుడు ప్రజా మన్ననలు పొందుతారని చెప్పారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఎస్సై ఆరంగి నరేష్‌ను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ, భోగాపురం ఎస్సైలు ఎ. సన్యాసినాయుడు, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెరుకుపల్లి గ్రామ మహిళలు

భోగాపురం: గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు సంబంధించి స్థలాలను కేటాయించాల మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీ ప్రభుత్వం హడావిడిగా స్థలాలను చూపించకుండా పట్టాలు మంజూరు చేసిందన్నారు. తమకు స్థలాలు కేటాయించాలని ఈ సందర్భంగా తహసీల్దార్‌ను కోరారు.

ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్



తల్లిదండ్రుల కాళ్లు కడుగుతున్న పిల్లలు

విజయనగరం అర్బన్: నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి నమస్కరించారు. నేటితరం విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను కూడా నేర్చుకోవాలని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకుడు వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, పాఠశాల డీన్లు సత్యనారాయణ, సూర్యచంద్ర, సాయికిశోర్, అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాలు ప్రారంభం

భోగాపురం: మండలంలోని రావివలస గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన నూతన భవనాలను మంగళవారం ప్రారంభిస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 40 లక్షలతో సచివాలయ భవనం, రూ. 21.80 లక్షలతో ఆర్‌బీకే భవనం, రూ. 17.50 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- కోలగట్లను సన్మానించిన వైఎస్సార్‌సీపీ నగర నూతన కమిటీ సభ్యులు



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న నగర కమిటీ సభ్యులు

విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల నగర నూతన కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు కోలగట్ల వీరభద్రస్వామిని సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్‌ను సత్కరించారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షుడిగా 11వ సారి నియామకమైన ఆశపు వేణు మాట్లాడుతూ.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేసి.. రానున్న ఎన్నికలలో పార్టీ విజయాన్ని కానుకగా ఇస్తామన్నారు. సంక్షేమ పాలన వల్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి విశేష ప్రజాదరణ వచ్చిందని చెప్పారు. అనంతరం 27 మంది సభ్యులను కోలగట్లకు పరిచయం చేశారు. పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, 2024లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా తామంతా పని చేస్తామన్నారు. సంక్షేమ పాలన ఎలా ఉంటుందో నగర ప్రజలు చూశారన్నారు. రానున్న ఎన్నికల్లో రుణం తీర్చుకునేందుకు ప్రజలందరూ కోలగట్ల వెంటే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షులు గొలగాన సాయి లక్ష్మి, బంగారు దేవుడు, కార్యదర్శి రెడ్డి పద్మావతి, జామాన శ్రీనివాసరావు, కోశాధికారి కాపుగంటి రమేష్, కార్యదర్శి కలిశెట్టి సుధాకర్, మొయిద ఆదినారాయణ, దువ్వ శ్రీను, తోట రాజశేఖర్, వర్రి పద్మావతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



హాజరైన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సోమవారం సాయంత్రం తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న సీనియర్ సిటిజన్లతో భారీ స్థాయిలో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల్లో బూత్ కమిటీ చురుకైన పాత్రను పోషించాలన్నారు. పారదర్శకంగా పనిచేస్తే ఏ ఎన్నికల్లోనైనా గెలవచ్చని చెప్పారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం విమర్శలు చేస్తోందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్న చరిత్ర టీడీపీ నాయకులదేనన్నారు. చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడగడం వైఎస్సార్‌సీపీ నాయకుల నైజమని చెప్పారు. మరోసారి శాసనసభ్యుడిగా తనకు అవకాశం ఇస్తే సమస్యల్లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. పట్టణంలోని సోనియానగర్‌లో టిడ్కో గృహాలను మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే 25న బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

- ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



నేత్ర వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద విజయరామపురం గ్రామంలో వీవర్స్ సొసైటీ ఆధ్వర్యంలో విజన్ స్ప్రింగ్ సంస్థ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లు దాటిన తర్వాత ప్రతిఒక్కరూ కంటి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకుంటే అంధత్వాన్ని నివారించవచ్చని తెలిపారు. ఆకు కూరలు ఎక్కువగా తీసుకుంటే కంటి సమస్యలు రావని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా స్వర్గధామం పనులు

నెల్లిమర్ల: పట్టణ సమీపంలోని చంపావతి నదీతీరాన స్వర్గధామం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సహకారంతో పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట పార్టీ నాయకులు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, మహంతి అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు, నౌపాడ శ్రీనివాసరావు, మజ్జి గణేష్, బూర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆరోగ్య హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో గల వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా సోమవారం ఆరోగ్యహోమం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస సేవా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ్‌కుమార్, చెరుకూరి శ్రీధర్ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం విశిష్ట పూజాధికాలు చేశారు.

చేసిన అభివృద్ధి చెప్పి ఓటు అడిగే దమ్ముందా..



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు

- వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ రాజేష్

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గడిచిన 57 నెలల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మండిపడ్డారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు లోకేశ్ తమ నాయకుడు వీరభద్రస్వామిపై చేసిన ఆరోపణలను తాము ఖండిస్తే.. జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు విమర్శలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల సారథ్యంలో విజయనగరం ఎంతో అభివృద్ధి చెందిందని గర్వంగా చెప్పగలమన్నారు. త్వరలో జరగనున్న ఎన్నిక ల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని, ప్రజాక్షేత్రంలో కోలగట్ల వీరభద్రస్వామి విజేతగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2019లో శాసనసభ్యుడిగా ఎన్నికైన కోలగట్ల వీరభద్రస్వామి నగరంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారన్నారు. ఫలితంగా కార్పొరేషన్ ఎన్నికల్లో 48 స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుందని గుర్తు చేశారు. కల్లబొల్లి మాటలు చెపుతూ పబ్బం గడుపుకునే టీడీపీ నాయకులు కళ్లు తెరిచి అభివృద్ధిని చూసి మాట్లాడాలని హితవుపలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మారంబాల బ్రహ్మరెడ్డి, బొద్దాన అప్పారావు, గాదం మురళి, పిలక శ్రీను, పిన్నింటి చంద్రమౌళి, మొయిద ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా శ్యామ్



దాడిచిలుక శ్యామ్

విజయనగరం అర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకి చెందిన ముంజేరు జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు దాడిచిలుక శ్యామ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సమావేశంలో ఎంపికైన నూతన రాష్ట్ర కమిటీలో తనకు స్థానం లభించిందని పేర్కొన్నారు

మర్చిపోయిన వస్తువులు అప్పగించేందుకు చర్యలు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆటోల్లో మర్చిపోయిన వస్తువులను బాధితులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆటోల్లో ప్రయాణికులు ఆటోల్లో మరిచిపోయిన వస్తువులను సోమవారం విలేకరులకు చూపించారు. ప్రయాణికులు మరిచిపోయిన వస్తువులను ఆటో డ్రైవర్లు తమకు అప్పగించారని సీఐ తెలిపారు. రెండు బ్యాగుల్లో దుస్తులు, గ్యాస్ స్టవ్ ఉన్నాయని, బాధితులు ఆధారాలతో వస్తే అప్పగిస్తామన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖాల అధికారులు హాజరుకావాలని కోరారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

నెల్లిమర్ల రూరల్: వచ్చే నెల 3న జరగనున్న పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు పీవీ శిరీషా, ధనుంజయ్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొండవెలగాడ సచివాలయంలో ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొండవెలగాడ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లోనూ చిన్నారులకు శతశాతం పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాణి, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దెంకాద: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు కలుగుతాయని అంబేడ్కర్ కళాబృందం సభ్యులు తెలిపారు. ఈ మేరకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై చింతలవలస గ్రామంలో సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో గల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముందు సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పూడి శ్రీనివాస్, గోగాడ శ్రీనివాస్, సందీప్ ఐశ్వర్, సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో పారదర్శక పాలన

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



సేవావజ్ర అవార్డుకు ఎంపికైన గ్రామ వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. గ్రామ వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ మానస పుత్రికలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజలకు వారి ఇంటి వద్దనే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వలంటీర్లదేనన్నారు. వారు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నగదు పురస్కారాలు అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం 245 మంది గ్రామ వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, దుప్పాడ మాజీ సర్పంచ్ కరుమజ్జి రాములప్పుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమా రామలింగేశ్వర ఆలయ పునఃప్రారంభోత్సవం



అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న అవనాపు విక్రమ్

విజయనగరం: బుచ్చన్న కోనేరు జంక్షన్ వద్ద గల ఉమా రామలింగేశ్వర ఆలయ పునఃప్రారంభోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్‌వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో ఆయన భక్తులకు ప్రసాదం వడ్డించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు చేయూత

- నాబార్డు డీజీఎం పనికర్



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం పనికర్

నెల్లిమర్ల రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి నాబార్డు చేయూత అందిస్తోందని నాబార్డు డీజీఎం పనికర్ అన్నారు. మండలంలోని రామతీర్థంలో ఏపీజీవీబీ సౌజన్యంతో నిర్వహిస్తున్న అగరబత్తీల తయారీ కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతేడాది జనవరి నెలలో నాబార్డు సహకారంతో 30 మంది డ్వాక్రా మహిళలకు అగరబత్తీల తయారీపై శిక్షణ అందించామన్నారు. ఏపీజీవీబీ సహకారంతో యూనిట్‌ను ఏర్పాటు చేసి విజయవంతంగా నడిపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం నాగార్జున, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి యువతకు శివాజీ స్ఫూర్తి



శివాజీ విగ్రహానికి పూలమాలలేస్తున్న పృథ్వీ, తదితరులు

విజయనగరం టౌన్: ఛత్రపతి శివాజీ భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకమని వాట్ సంస్థ అధ్యక్షుడు నేటిపల్లి పృథ్వీ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్దనున్న శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ సనాతన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడిన వ్యక్తి శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మద్దిల సోంబాబు, గ్రంధి వినోద్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రజక సంఘ నాయకులు

విజయనగరం టౌన్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద కులసంఘ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు, కార్యదర్శి జంపా చిన్న, కోశాధికారి రాజారావు, సన్యాసిరావు, చిట్టిబాబు సింహాచలం, గోవింద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.